"రాడగారూ.....ఎవరికి ఇష్టము వష్షిన పద్దతులలో వారు తిందురు దీనికి ఇండియా, అమెరికా దేషముల ప్రషక్తి తేచ్చుట అనవషరము" అన్నాడు రాధ వంక సీరియస్‌గా చూస్తూ సుందర్.

ఆ సమయంలో టిఫిన్ తినడం మొదలుపెట్టారు.

"పచ్చడిలో ఉప్పు కాస్త ఎక్కువైనట్టుంది కదే సీత ?" అంది రాధ.

"ఏమైనా తినునప్పుడు ఇట్లు వంకలు పెట్టిన ఎడల అమెరికాలో అప్పడాల కర్రతో కొట్టెదరు" పళ్ళునూర్తూ అంది రాధ.

"ఓ....వాటె న్యూసేన్స్" అన్నాడు సుందర్.

"అబ్బా......ఏం తల్నొప్పిరా నాయనా!" అంది రాధ తలపట్టుకుంటూ.

"ఏయ్ రాధా నువ్వూరుకోవే! ఎందుకూ అనవసరమైనా గోడవ?" సీత రాధని మందలించింది.

"ఒరేయ్ సుందర్! నువ్వూరుకో....ఎందుకూ అనవసరంగా?" బుచ్చిబాబు సుందర్‌ని మందలించాడు.

"ఎస్! ఇప్పుడు అనవసరం! అవషరం వున్నప్పుడు మాటాడ్తాం" అన్నాడు సుందర్ ఇడ్లీ ముక్క తుంపుతూ.

టిఫిన్లు అయ్యాయి! కాఫీలు కూడా అయ్యాయి. అక్కడ అ నలుగుర్లోనూ చచ్చేంత టెన్షన్!

ఎవరికి వారు ఎవరు ముందు ఆ టాపిక్ ఎత్తుతారు అని ఎదురుచూస్తున్నారు. ముందుగా ఒకరు ఆ టాపిక్ ఎత్తితే మిగతావాళ్లు దాని గురించి మాట్లాడవచ్చని అనుకుంటున్నారు. కానీ ఎవరూ ఆ టాపిక్ ఎత్తరు.

సరిగ్గా ఆ టైంలో బుచ్చిబాబు ఆఫీసులో పనిచేసే శేఖర్ వచ్చాడు.

"రండి సార్ రండీ..... ఏంటిలా వచ్చారు?" అంటూ శేఖర్‌ని ఆహ్వానించాడు బుచ్చిబాబు.

"ఇప్పుడే ఆఫీసుకెళ్ళాను. మీరు సెలవు పెట్టి ఇంటి దగ్గరున్నట్టు చెప్పాడు. అందుకే ఇక్కడికి వచ్చాను" అన్నాడు శేఖర్.

"ఓ....!అలాగా? అన్నట్టు మర్చిపోయాను. ఇతను సుందర్! నా ఫ్రెండ్. ఈమె సీత ఆమె ఫ్రెండ్ రాధ" అంటూ పరిచయం చేశాడు.

"ఇంతకి అర్జంటుగా మా ఇల్లు వెతుక్కుంటూ రావడానికి కారణం?"

"వచ్చేవారం నా పెళ్ళి. ఆఫీసులో అందరికీ కార్డ్స్ ఇచ్చాను. ఇంక మీరొక్కరే మిగిలిపోయారు అందుకే వచ్చాను" అన్నాడు శేఖర్ తన హ్యాండ్ బ్యాగ్‌లోంచి కార్డ్సు తీస్తూ.

"ఓ......వాటె పిటీ" అన్నాడు సుందర్ తన కుడి చెయ్యివెనక్కి పెట్టి పోనీటెయిల్‌ని ఎగరేస్తూ.

"ఏంటండీ?" సుందర్ వంక అయోమయంగా చూస్తూ అన్నాడు శేఖర్.

"ఏం లేదు. ఓ....వాట్ సిటీ అంటున్నాడు మా వాడు. ఈ సిటీ వాడికి బాగా నచ్చిందంట. అంతే...అంతే! ఇంతకీ అమ్మాయి ఎవరు? ఏం చేస్తుంది ?" అడిగాడు బుచ్చిబాబు.

"ఆ అమ్మాయి మా ఎదురింట్లో వుంటుంది. మే ఇద్దరం ప్రేమించుకున్నాం. డిగ్రీ పూర్తి చేసి ప్రస్తుతం ఖాళీగానే వుంటుంది" సిగ్గు పడ్తూ చెప్పాడు శేఖర్.

"ఓ...అయితే లవ్ మ్యారేజ్ అన్నమాట" చప్పరిస్తూ అన్నాడు బుచ్చిబాబు.

శేఖర్ తెల్లబోయి బుచ్చిబాబు వంక చూసాడు. అతని మొహంలోని ఎక్స్‌ప్రెషన్ ఏంటో శేఖర్‌కి అర్థం కాలేదు.

"పోన్లెండి! మీరు కొంతమంది మూర్ఖుల్లా కాకుండా ప్రేమించిన అమ్మాయిని చక్కగా పెళ్ళి చేసుకుంటున్నారు" శేఖర్‌తో అంది సీత బుచ్చిబాబు వంక కోపంతో చూస్తూ.

"మూర్ఖులే పెళ్ళి చేసుకుంటారు" సీతవైపు సీరియస్‌గా చూస్తూ అన్నాడు బుచ్చిబాబు.

"అదేంటి అలా అంటారు. ఎవరైనా ప్రేమించిన అమ్మాయిని కాదని మరో అమ్మాయిని చేస్కుంటే మూర్కుడుగానీ ప్రేమించిన అమ్మాయినే పెళ్ళి చేస్కుంటే ఎలా అవుతాడు?" వెర్రి మొహం వేసుకుని చూస్తూ అన్నాడు శేఖర్.

"అసలు ప్రేమింషిన అమ్మాయ్ ప్రేమింషలేని అమ్మాయి అని ఆలోషన అనవసరము. ఎవరైననూ పెండ్లి చేసుకొనుట మంషి పనికాదని మేము షెప్పుషున్నాం" అన్నాడు సుందర్.

శేఖర్ కంగారు పడ్డాడు. పొరపాట్న నేను మెంటల్ హాస్పిటల్‌కి గానీ రాలేదు కదా? అనుకున్నాడు.

రాధకి అతని అవస్థ చూస్తే జాలేసింది. అతని భావం కూడా అర్థం అయింది.

"మీరు ఇంకాస్సేపు ఇక్కడే వుంటే నిజంగానే పిచ్చాసుపత్రికి వెళ్ళాల్సి వస్తుంది. ఆ కార్డు ఇచ్చేసి త్వరగా వెళ్ళిపోండి" అంది రాధ శేఖర్‌తో.

శేఖర్ బుద్దిగా తల ఊపుతూ కార్డు మీద శ్రీమతి శ్రీ బుచ్చిబాబు అని రాసి బుచ్చిబాబు చేతికి అందించాడు.

"మీరు కూడా పెళ్ళికి తప్పకుండా రండి" అని రాధ, సుందర్లతో అన్నాడు భయం భయంగా చూస్తూ.

"అలాగే" అంది రాధ.

"నేనిక వస్తా. ఇంకా చాలా మంది ఇళ్ళల్లో ఈ దినం కార్డులు" అని నాలుక కరుచుకుని "పెళ్ళి కార్డులు ఇవ్వాలి" అని తడబడే అడుగులతో బయటకి వెళ్ళిపోయాడు.

నలుగురూ హాల్లో సోఫాల్లో సెటిలయ్యాక ఉదయం నుండి వీళ్ళు ఎదురు చూస్తున్న చర్చ మొదలయింది.

"అసలు ప్రేమింషిన వాళ్ళు ఎందుకు పెండ్లి షేషుకోనెదరో ప్రేమను ఎందుకు షంపుకోనెదరో నాకు అర్థముకాదు" అన్నాడు సుందర్ దీర్ఘంగా నిట్టూరుస్తూ.

"మీకు అర్థం కాకపోయినా స్త్రీకి విలువ ఇచ్చేవారికి మాత్రం అర్థం అవుతుంది లెండీ" చటుక్కున అంది రాధ.

"అనగా నేను స్త్రీ కి విలువ ఇవ్వనని మీ ఉద్దేషమా?" రాధ వంక సీరియస్‌గా చూస్తూ అన్నాడు సుందర్.

"ఏమో మరి... ఆ విషయం మీకే తెలియాలి" మూతి తిప్పుతూ యెటో చూస్తూ అంది రాధ.

"అయినా పెళ్ళీ పెటాకులు లేకుండా ఒక ఆడది వేరే మగాడితో కలసి జీవిస్తే ఆ ఆడదానికి ఈ సంఘంలోఏమైనా విలువ వుంటుందాండీ?" ఈ సారి సీత సుందర్‌ని అడిగింది.

తమ పెళ్ళి క్యాన్సిల్ కావడానికి సుందరే అసలైన కారకుడని సీతకి సుందర్ మీద చాలా గుర్రుగా వుంది. రాధా, సీత సుందర్‌ని ప్రశ్నలతో ఎటాక్ చేయడానికి నిర్ణయించుకున్నారు.

"విలువ ఎందుకు వుండదు? నేనూ, జూలీ అమెరికానందు కలసి జీవించుషుషున్నాము. మరి జూలీకి అందరూ విలువ ఇష్టుటమలేదా?"అన్నాడు సుందర్.

"మీరూ ఆ గోలీ కలసి జీవిస్తున్నారంటే అదివేరే విషయం" అంది రాధ.

"గోలీ కాదు జూలీ" సీరియస్‌గా చూస్తూ అన్నాడు సుందర్.

"ఏదో ఒకటిలే! అది అమెరికా... ఇది ఇండియా... అక్కడి పరిస్థితి వేరు. ఇక్కడి పరిస్థితి వేరు.

"అషలు ఈ భూమి పుట్టినప్పుడు మానవుడు పుట్టినప్పుడూ అందరూ ఒకే విధంగా వుండెను. కాలము గడిసినకొద్దీ ఒక ప్రాంతమునందు నివషించువారు వారికై వారు కొన్ని పద్దతులు, ఆషారములు ఏర్పరషుకొనికి. వేరే ప్రాంతమువారు వేరే పద్దతులు, అషారములు ఏర్పరషుకొనిరి. ఇవన్నియూ మనము ఏర్చరషుకొనినవే. వద్దనుకునినషో పోవును. కావాలని అనుకునినషో వుండును."

"ఏంటీ మాకిప్పుడు చరిత్ర పాఠాలూ, సోషల్ స్టడీస్ పాఠాలు చెపుతున్నారు?" వ్యంగ్యంగా అంది సీత.

బుచ్చిబాబు సీత వంక సీరియస్‌గా చూసాడు. కానీ అతని చూపుల్ని అమె కేర్ చేయలేదు.

"మీరు ఎన్నయినా చెప్పండి. ఇండియాలో అలాంటి పరిస్థితి రాదు. మేము కుటుంబ వ్యవస్థకీ ప్రేమా ఆప్యాయతలకీ, సెంటిమెంట్స్‌కి చాలా అలవాటు పడినవాళ్ళం" అంది రాధ.

"అటులయిన పెండ్లి షేషుకొనినయడలు ప్రేమ వుండునవియూ మీ ఉద్దేషము. పెండ్లి షేషుకున్నా వెంటనే ప్రేమ నషించును. షాలా మంది ప్రేమికులు పెండ్లి షేషుకున పిదప కుక్కలవలె కొట్లాడుకోనుట నేను సూషితిని."

"అంటే మా సీతా బుచ్చిబాబు పెళ్ళీ గిళ్ళీ లేకుండా కాపురం చెయ్యాలంటారు? దానికి ఈ సంఘం ఒప్పుకోదు" రెచ్చిపోతూ అంది రాధ.

"షంగానికి ముందుగా షెప్పిన కావలెను. మనము షంగము కోరకు లేము. షంగమే మనకోరకు కలదు. ఇదివరకు విధవా వివాహములను ఈ షంగము ఒప్పుకోనినదా? లేదు! మనము నమ్మినదానిని వేసి ఇతరులకు మార్గదర్షకులము కావలెను. ఇతరులు మనము అషరింషిన దానిని అషరింషిన ఈ షంగము తోక ముడుషును . ఆప్పుడు మనము అదర్శ పురుషుడు అగుదుము" కాలర్ ఎగరేస్తూ అన్నాడు సుందర్.

బుచ్చిబాబు అవుననట్లు బుర్రకాయ్ ఊపాడు.

దానికి రాధ తీవ్ర స్వరంతో జవాబిచ్చింది "దానికి దమ్ము కావాలండీ సుందర్‌గారూ! మీ బుచ్చిబాబుకి ఆ దమ్ములు లేవు. ఉంటే ఇందాక అయన వెడ్డింగ్ కార్డు మీద శ్రీమతి అండ్ శ్రీ బుచ్చిబాబు అని రాసి ఇచ్చినప్పుడు సీత నా శ్రీమతి కాదు. ఆమె నా స్నేహితురాలు. నేనూ ఆమె కలసి జీవిస్తున్నాం' అని ధైర్యంగా అతనితో చెప్పి ఉండేవాడు. బుచ్చిబాబు గారు అలా చెప్పలేదంటే ఆయనకి ధైర్యం అయినా లేకపోయిన ఉండాలి లేదా తను చేస్తున్నది తప్పని గిల్టీగా అయినా ఫీలయి ఉండాలి".

రాధ మాటలకి బుచ్చిబాబుకి చాలా కోపం వచ్చింది.

"అలాగా...సరే! రేపటి నుండి సీత నా భార్య కాదని సిల్లీగా చాటింపు వేస్తాను" అన్నాడు ఆవేశంగా.

"వెర్రీగుడ్! దటీజ్ బుషిబాబు!" సంతోషంగా బుచ్చిబాబు భుజం తట్టాడు సుందర్. "ఇప్పుడు ఈ సుందర్‌కి అసలైన స్నేహితుడువి"

"అయినా నాకు తెలియకడుగుతానూ మీ చెల్లెలికి కూడా ఇలాగే సలహా ఇస్తారా....పెళ్ళి చేసోకుండా కాపురం చెయ్యమని?" అడిగింది రాధ.

తన స్నేహితుడిని అటువంటి ప్రశ్న వేసేసరికి బుచ్చిబాబుకి రాధ మీద మరీ కోపం వచ్చేసింది. కానీ సుందర్‌కి ఏమాత్రం కోపం రాలేదు. అతను చిరునవ్వుతో సమాధానం ఇచ్చాడు.

"నాకు షెల్లెలు లేదు. ఉన్నషో అటులనే సలహ ఇషెదను"

"ఒరేయ్ సుందర్.....వీళ్ళతో మనకేంట్రా.....పద! మనం అలా బయటికెళ్ళొద్దాం" అంటూ సుందర్‌ని బయటికి లాకెళ్ళిపోయాడు బుచ్చిబాబు.

సీత దీనంగా రాధ వంక చూసింది.

"నువ్వేం దిగులు పడకు. అనుభవం మీద బుచ్చిబాబుకే తెలుస్తుంది! అంతా నే చెప్తాగా!"

సీత భుజం మీద తట్టింది రాధ.

రెండురోజుల గడిచిపోయాయి.

ఈ రెండు రోజులు సీతా , రాధ ఆ ప్రసక్తి తీసుకురాలేదు. బుచ్చిబాబు , సుందర్లు అంతకంటే తీసుకురాలేదు.

ఏం జరగనట్టు ఆ నలుగురూ సరదాగా కబుర్లు చెప్పుకుంటూ, పేకాడుతూ కాలక్షేపం చేసేశారు. నలుగురూ కలిసి చుపుక్ చుపుక్ ముద్దుల బుల్లోడు అనే సినిమాకి వెళ్ళారు.

"నేను అమెరికాలో డబుల్ యక్స్ సినిమా చూసినప్పుడు కూడా ఇంట సిగ్గుపడలేదు ......ఓ......"అన్నాడు సుందర్ ఇంటికొచ్చిన తర్వాత "చుపుక్ చుపుక్ ముద్దుల బుల్లోడు" గురించి కామెంట్ చేస్తూ.

బుచ్చిబాబుకి మాత్రం గుండెలమీద నుండి ఎంతో భారం దించినట్టయింది. ఆ రెండు రోజులూ ఎంతో కష్టంతో గడుస్తాయని అనుకున్నాడు గానీ అంత సర్దాగా, తేలికగా గడిచిపోతాయని అతను అనుకోలేదు.

కానీ మధ్య మధ్యలో రాధ , సుందర్‌లు ఒకరిమీద ఒకరు విసుర్లు విసురుకోవడం మాత్రం మానలేదు. ముందుగా ఊరికి రాధ బయలుదేరింది. నలుగురు బస్టాండుకి వెళ్ళి రాధను దింపారు.

"నువ్వేం దిగులుపడకు......ఈ విషయంలో గుణపాఠాలు నేర్చుకోవలసిన అందరూ నేర్చుకొంటారు" బుచ్చిబాబు సుందర్ వినేలా అంటూ సీత వీపుతట్టి రాధ హైదరాబాద్ బస్సెక్కింది.

అక్కడినుండి ముగ్గురూ రైల్వేస్టేషన్‌కి వెళ్ళారు.

"అన్నీ ఆడవారు షెప్పిన విధముగా సేయరాదు. మగవాడివల్లె బ్రతుకుము.....ఫోర్స్ ఉపయోగింపుము?" రైలు కదిలేముందు సుందర్ బుచ్చిబాబుతో అన్నాడు.

సీత మూతిని ముప్పైమూడు వంకర్లు తిప్పింది.

0 0 0

అ రోజు రాత్రి.......

భోజనాలయిన కాస్సేపు తర్వాత బుచ్చిబాబు మంచం మీద నడుం వాల్చాడు.

"నీ చాప కోసం వెతుక్కుంటావేమో.....అదిగో అ మూల పెట్టాను" అన్నాడు బుచ్చిబాబు నిద్ర కళ్లతో అవులిస్తున్న సీతతో.

"అక్కర్లేదు!...నీ ప్రక్కనే పడుకుంటా?" అంది సీత.

బుచ్చిబాబు తన చెవుల్ని తానే నమ్మలేకపోయాడు "అసలు నేను సరిగ్గానే విన్నానా?" అనుకున్నాడు. అతను తేరుకునేలోగానే సీత లైటార్పి బుచ్చిబాబు ప్రక్కన పడుకుంది.

"ఏంటీ నీ ప్రవర్తన చాలా సిల్లీగా ఉందే...హఠాత్తుగా ఇలా ప్రక్కకొచ్చి పడుకున్నావు?" అన్నాడు.

"సిల్లీగా ఉన్నది నా ప్రవర్తనా నీ ప్రవర్తనా?" అంటూ అటు తిరిగి పడుకుంది సీత.

కొంపదీసి  రాధకూడా ఇంక లాభంలేదని సీతకి లెసన్ తీసుకోలేదు కదా తను చెప్పినట్టు నడుచుకోమని?...

ధాంక్యూ రాధా...ధాంక్యూ!

మనసులో అనుకున్నాడు బుచ్చిబాబు .

"అటు తిరిగి పడుకున్నావేం....ఇటు తిరిగి పడుకో...." అన్నాడు బుచ్చిబాబు మనసులోని ఆనందాన్ని అదుపులో పెట్టుకుంటూ.

"ఊహు..నేనిటే తిరిగి పడుకుంటా?" అంది సీత .

"కాస్సేపు కబుర్లు చెప్పచ్చుగా?"

"ఈ రెండు రోజులూ అర్ధరాత్రి దాకా చెప్పుకున్న కబుర్లు చాలవా?"

"అందరం కలిసి చెప్పుకున్నాంగానీ ఇద్దరం ఏకాంతంగా కబుర్లు చెప్పుకోలేదుగా ... అసలు హైదరాబాద్ నుండి ఇక్కడికొచ్చాక నువ్వు కబుర్లు చెప్పడమే మానేశావ్... ఇదివరకే నయం! పార్కుల్లో రెస్టారెంట్లలో మనం మనసు విప్పుకుని బోల్డన్ని కబుర్లు చెప్పుకునేవాళ్ళం .... అవునా?...."

"ఏమోలే..నాకు బాగా అలసటగా ఉంది.... నేనిక పడుకుంటా. నువ్వూ పడుకో? గుడ్‌నైట్!" అంది సీత.

"గుడ్‌నైట్!" అన్నాడు బుచ్చిబాబు బలవంతంగా.

ఒక అయిదు నిముషాల్లోనే సీత గాఢమయిన నిద్రలోకి వెళ్ళి పోయింది.

సీత నా ప్రక్కన పడుకున్నందుకు నాకు నిద్రపట్టడంలేదు... అదీ నా ప్రక్కన పడుకున్న సీతకి ఇంత హాయిగా నిద్రెలా పట్టిందబ్బా అనుకున్నాడు బుచ్చిబాబు .

అరగంట సేపు అవస్థలు పడిన తర్వాత బుచ్చిబాబు నిద్రలోకి ఒరిగాడు. మళ్ళీ రాత్రి రెండుగంటలకు అతనికి హఠాత్తుగా మెలుకువ వచ్చింది. కారణం నిద్రలో సీత తన కాలును బుచ్చిబాబు కాలుమీద వేసింది.

మెలుకువ వచ్చిన బుచ్చిబాబు మళ్ళీ నిద్రలోకి ఒరగాలంటే చాల కష్టమయ్యింది.

ప్రక్కన అమాయకంగా ముద్దయిన మొహంతో నిద్రపోతున్న సీత !

లోపల ఎన్నెన్నో మధురమైన ఊహలు.

సీతని గట్టిగా దగ్గరకు లాక్కుంటేనో?! అనుకున్నాడు.

అమ్మో?....మళ్లీ నడ్డి విరిగేలా క్రిందకి తోసేస్తుందేమో?

భయంతో మనసులోని కోరికలు చంపుకున్నాడు బుచ్చిబాబు.

మళ్లీ అతను నిద్రలోకి ఎప్పుడు ఒరిగాడో అతనికే తెలీదు.

0 0 0